# నీతులెవరికి?

పార్వతీపురం ఆర్టీసీ కాంప్లెక్స్‌లో విజయనగరం వెళ్లే ఎక్స్‌ప్రెస్ కదలడానికి సిద్ధంగా ఉంది. భారీకాయాన్ని ఊపుకొంటూ పరుగులాంటి నడకతో వస్తున్నాడో వ్యక్తి. నల్లటి దేహచ్ఛాయ, పాల నురుగు లాంటి తెల్లటి పంచ, లాల్చీ, కుడిచేతి నాలుగు వేళ్లకి నాలుగు ఉంగరాలు, ఎడం చేతికి గోల్డ్‌చైన్ రిస్టువాచి, మెడలో చిటికెనవేలు వెడల్పుతో, పులిగోళ్లతో లాకెట్‌తో సహా వేళాడే చైన్. బస్సు ఎక్కుతొంటే రైట్ చెప్పబోయేడు కండక్టరు.

"ఆగవయ్యా, వెనకాతల మా ఆడవాళ్లు వస్తున్నారు. ఏటా తొందర" ఫుట్‌బోర్డు మీదే కాలు పెట్టి బయటకు చూస్తూ అన్నాడా వ్యక్తి. "అదేటండీ ఇప్పటికే పది నిమిషాలు ఆలస్యమైంది. తొందరగా రమ్మనండి. ఇంతకీ ఎంత దూరంలో ఉంది ఆవిడ" అంటూ తనూ బయటకు చూసేడు కండక్టరు.



బస్సుకు పది అడుగుల దూరంలో ఉంది ఆవిడ. పాపం భర్తకన్నా ఇంకా కొంచెం భారీకాయమే. ఆ బరువుకు తోడు కట్టుకున్న పట్టుచీర బరువు, మెడ తిరక్కుండా దిగేసుకున్న బంగారు ఆభరణాల బరువుతో కదలలేక కదలలేక కదులుతున్న శరీరాన్ని మెల్లగా ఊపుకుంటూ వచ్చి బస్సెక్కింది.

బస్సులో ఎక్కడ సీటు ఖాళీ ఉందో అని భార్య చెయ్యి పట్టుకునే జనాన్ని తోసుకుంటూ ముందుకు నడుస్తున్నాడా వ్యక్తి.

"సర్పంచ్ బాబుగారా, కొంచెం ముందు రావాలిసింది అయ్యా, అమ్మ కూర్చుందుకు ఖాళీ లేదయ్యా. బస్సంతా నిండిపోయింది" అన్నాడో తెలిసిన వ్యక్తి.

"ఆ.. ఎందుకుండదు.. అదే దొరుక్కుద్ది సీటు" అంటూ ఎవరి మీద వేటు వెయ్యాలా అనుకొంటూ అటు ఇటు చూసుకొంటూ ముందుకెళ్తున్న సర్పంచ్‌బాబుకు ఒక సీటు మీద కన్ను పడనే పడింది. ఠక్కున అక్కడే ఆగిపోయి "ఏటండోయ్. ఇది లేడీసు సీటు కదా. లేవండి లేవండి లేడీసు ఉన్నారు" అన్నాడు. అంతవరకూ కబుర్లు చెప్పుకొంటూ కూర్చున్న ఆ ముగ్గురు శాల్తీలు గబుక్కున వెనక్కు తిరిగారు. "అదేమిటండీ ఇందాకల నుంచి ఇక్కడే కూర్చున్నాం. ఇపుడొచ్చి లేవమంటున్నారేమిటి" అన్నాడు ఒక వ్యక్తి.

"ఏంటయ్యా మాట్లాడుతున్నావ్. చదువుకొన్న వాడిలా ఉన్నావ్. ఇది ఆడోళ్ల సీటని తెలీదా. నీళ్లోసుకున్న ఆడోళ్లు, చిన్న పిల్లల తల్లులు, రోగాలు, రొప్పులతో బాధపడుతున్న ఆడోళ్లు ఎందరో వస్తారు. వాళ్లకి మనం లేచి సీటివ్వాల్సింది పోయి వాళ్ల సీటునే మనం మింగేస్తే ఎలాగయ్యా! ఆడోళ్లని గౌరవించే దేశమయ్యా మనది లే లే" అంటూ చిన్నసైజు ఉపన్యాసమిచ్చాడు ఆ బాబు.

మారు మాట్లాడకుండా లేచి సీటు ఖాళీ చేసి జనాన్ని తోసుకుంటూ వెనక్కెళ్లి నిలుచున్నారు.

విజయగర్వంతో ముందుకడుగేసి భార్యని ఆ నిలుచున్న జనం మధ్యలోంచి ఎలాగో తప్పించి తను సాధించిన సీటులో కూర్చోపెట్టి పక్కనే ఆసీనుడయ్యాడు. ఇద్దరి శరీరాలు భారీవే కాబట్టి ఇద్దరికీ సరిపోయి సరిపోనట్టు అయింది ఆ సీటు. కులాసా కబుర్లలో పడ్డారు దంపతులిద్దరూ.

బస్సు సీతానగరం వచ్చింది. ఎవరో ఇద్దరు ముగ్గురు మగాళ్లు ఎక్కి వెనక్కి తోసుకుంటూ వెళ్లిపోయారు. బస్సు కదలబోతూ ఉంటే అప్పుడెక్కిందా శాల్తీ.

పాపం చంకలో ఏడాది పిల్ల, అమ్మచీర కుచ్చెళ్లు పట్టుకొని భయభయంగా అటుఇటు చూస్తున్న మూడేళ్ల చిన్నోడు. ఆ తల్లి చూస్తే నిండా పాతికేళ్లు ఉండవు ఏదో జబ్బుతో బాధపడుతున్నట్టు నీరసంగా, నిస్తేజంగా కనిపిస్తోంది. పిల్లాడ్ని ఈడ్చుకొంటూ చంకలో పిల్లని ఎగదోసుకుంటూ పడిపోతానేమో అనే భయంతో అడుగులో అడుగు వేసుకుంటూ జనాన్ని తప్పించుకొంటూ ఈ భార్యాభర్తలు కూర్చున్న సీటు దగ్గరకొచ్చి సీటు నానుకొని నిల్చుంది. ఎవరేనా జాలి తలచి సీటిస్తారేమోనన్నట్టు దీనాతిదీనంగా చూస్తోంది అడిగే ధైర్యం లేక. కబుర్లు చెప్పుకొంటున్న భర్తకి ఎవరో తనని తాకినట్టయి వెనక్కి తిరిగి చూశాడు.

చూడగానే అతని వళ్లు జలదరించింది. అబ్బా.. పిల్లలు తల్లి ఒక్క లాగనే ఉన్నారు. తైల సంస్కారం లేని జుట్లు, మురికోడుతూ ఏనాడూ చాకలి మొఖం చూడలేదన్నట్లు కంపుకొడుతూ చిరిగిన బట్టలతో అబ్బాబ్బ చూడడానికే అసహ్యంగా ఉన్నారు. ఇలాంటి వాళ్లని ఎలా బస్సెక్కిస్తారో వీళ్లు..ఛీ, ఛీ.' అనుకొంటూ "ఏయ్ కొంచెం వెనక్కెళ్లి నిలబడు. అలా మీద పడిపోతావేం" అంటూ చీదరించుకొన్నాడు.

ఆ మురికి తనకెక్కడ అంటుకొంటుందో అన్నట్టు కొద్దిగా వెనక్కి జరిగాడు. ఆ జరగడం తన చిన్నపిల్లడికి కాస్త చోటివ్వడానికేమో అనుకొందా పిచ్చితల్లి. పిల్లాడిని అక్కడ కూర్చోపెట్టబోయింది. "ఏయ్ ఏంటది. ఇక్కడ చోటు లేదు. వెనక్కెళ్లు. ఇక్కడెక్కడ కూర్చోపెట్టేస్తావ్" గొణుక్కుంటూ సీటు మొత్తం సర్దుకొంటూ రిలాక్స్‌గా కూర్చున్నాడు ఆ బాబు.

ఈ సీనంతా చూస్తున్న, ఈ సీట్లో కూర్చొని పెద్ద మనిషి బోధతో వెనక్కెళ్లిన కుర్రాళ్లలో ఒకడు ముందుకొచ్చాడు. "ఏమండోయ్ పెద్దమనిషిగారు, పాపం ఆడమనిషి చంటి పిల్లలతో ఉంది. ఆరోగ్యం కూడా బాగులేనట్టు ఉంది. కాస్త లేచి వాళ్లకి సీటివ్వండి" అన్నాడు.

"ఏంటయ్యా మాట్లాడుతున్నావ్. ఇందాకలి నుంచి ఈడ కూర్చున్నా. పైగా నా ఆడమనిషి ఉందిక్కడ నన్ను లేవమంటావేంటి" అన్నాడు ఇందాక తను బోధచేసి లేపిన అబ్బాయేనని గుర్తుపట్టక.

"శభాష్. ఆ మాటే ఇందాక మేము చెపితే నీతి బోధలు చేసి మమ్మల్ని లేపావే అది ఆడవాళ్ల సీటు కదా. పైగా చిన్నపిల్లల తల్లి, నీ ఆడామె ఎక్కడకి పోదుగానీ లే. లేచి నిలబడి ఆవిడకా సీటు ఇచ్చెయ్యి. ఎదుటివాడికి చెప్పేటందుకేనా నీతులు" అంటూ ఇంకేదో అనబోయాడు కుర్రాడు. ఇంతలో కండక్టరు కలుగజేసుకుని "మీరు లేవండి సారూ" అన్నాడు. కొంతమంది ప్రయాణీకులు కూడా గొంతు కలపడంతో విధి లేక లేచి నిలబడి ప్రయాణీకులు తన వైపు చూస్తున్న చూపులకు సిగ్గుపడి తలదించుకున్నాడా వ్యక్తి.

**-వి.సత్యవతీదేవి** (గుమ్మలక్ష్మీపురం)